# సత్యవాక్యు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

AUGUST - 1998

## సంక్షిప్త వార్తలు

జూన్ 22వ తేదీ ఆదివారం కొత్తపేట మండలం చినలంక గ్రామములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును జాషువా గూటం గారురిబ్బను కత్తిరించి ఆరాధనల నిమిత్తము తెరచిరి. చినలంకలోని సంఘము యిది వరలో నిర్మించిన మందిరము తుఫానుకు గురియై కూలిపోగా ఇప్పుడు దాని స్థానంలో ఒక చక్కటి ఆలయము నిర్మించబడినది. సహో. పి.జె. కృపాలినీ గారు చినలంకలోను పలివెల, బిళ్లకుర్రు గ్రామములలోను గత 20 సంవత్సరాలుగా దేవునికి కృషి చేయుచున్నారు. ఆలయ ప్రతిష్ట ఆరాధన అనంతరము ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

జూన్ నెల ఆఖరులో గుత్తెనదీవికి చెందిన నున్న రామకృష్ణ గారు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారికి అదే గ్రామములో పనిచేయుచున్న యు. స్టాలిన్ గారు సత్యవాక్యమును బోధించిరి. నున్న రామకృష్ణ గారి ద్వారా అనేకులు క్రీస్తులోనికి నడిపించబడగల్గునట్లు ప్రార్ధించుదాం.

జూలై నెల సువార్తికుల సదస్సు 15వ తేదీ బుధవారం నాడు కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణములో జయప్రదముగా జరిగెను. సదస్సుకు వారము రోజుల ముందు నుండీ పోస్టల్ సిబ్బంది దేశవ్యాప్తంగా సమ్మె జరుపుట వలన సువార్తికుల సదస్సును గూర్చి అందరికీ తెలియక పోయినను అనేకులు ఫోన్ల ద్వారాను, టెలిగ్రాం ద్వారాను తెలిసికొని సదస్సుకు హాజరైరి. వివిధ ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు, స్థానిక సభ్యుల వలన క్రీస్తు సంఘ ఆవరణము నిండియుండగా "క్రొత్త నిబంధన ఆరాధన యొక్క ప్రాముఖ్యత యేమి? ఆరాధనాంశముల యొక్క ప్రాముఖ్యతయేమి ?" అను అంశము చర్చించబడెను.

ముంగండ నుండి వచ్చిన సోదరులు సి.హెచ్. జాన్‌బాబు గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభము కాగా సోదరులు కె. రత్నకుమార్ గారు పాటలు నడిపించిరి. సోదరులు ఎస్. వీరంశెట్టి (ముమ్మిడివరం), యన్ రవికుమార్ (కరుగోరుమిల్లి), కొల్లి కామేశ్వరరావు (మండపేట), బి. ప్రసాదరావు (భీమవరం), పాల్ గూటం (గొల్లవిల్లి), జి. షడ్రక్ (పాలకొల్లు), ఎ. విశ్వేశ్వరరావు (కొవ్వూరు), గార్లు పై అంశముపై చక్కటి వివరణ యిచ్చిరి. మధ్యాహ్న కాల కూటములో సోదరులు డి. నానీ గారు పాటలు నడిపించగా సోదరులు ఆర్. బెనర్జీ (భీమవరం) ప్రారంభ ప్రార్ధన చేసిరి. చివరిగా సోదరులు యు. ప్రభాకరరావు గారి ప్రార్ధనతో సదస్సు సాయంకాలమున ఆశీర్వాదకరముగా ముగిసెను.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884-63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 19 | ఆగష్టు 1998 | సంచిక 1

## సంపాదకీయం

### దైవారాధన

### (Worship of God)

ఆదినుండియు మానవుడు, దేవుని నారాధించు స్వభావము కలవాడు. మనము దేవుని నెరిగి, ఆయనను మహిమ పరచవలెనని ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెనని దేవుడు కోరుచున్నాడు. దేవునియెడల మనకున్న భక్తి విశ్వాసము లన్నియును మనము ఆయనకు చేయు ఆరాధనలో తేట తెల్లమగును. దేవుని మనము ఆరాధించునపుడు నిష్కపటముగను, యధార్థముగను ఆరాధించవలెను.

యేసుప్రభువు ఇట్లనుచున్నారు : "అయితే యధార్థముగా ఆరాధించువారు, ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చే యున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4:23-24).

మానవులు దేవుని వెదకుటయే గాక ఆయనకు ఇష్టులై యుండుటకు ఆయనను వెదుకవలయును. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును" అని యేసుక్రీస్తు చెప్పెను. (మత్తయి 7:28).

దేవుని వెదకువారు దేవుని చిత్తము చొప్పుననే వెదుకవలెను గదా ? అట్లే మనము చేయు ఆరాధన దేవునికి ఇష్టపూర్వకముగా యుండవలెననిన, దేవుడు చెప్పినట్లే దానిని మనము చేయవలెను. లేనియెడల మన స్వంత అభిలాషల చొప్పున దేవుని సేవించి, ఆరాధించ ప్రయత్నించిన యెడల అట్టివి వ్యర్థమగును. భక్తుడైన యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు: "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తి గలవాడని అనుకొనిన యెడల వానిభక్తి వ్యర్థమే" (యాకోబు 1:26). మరల యేసుప్రభువు ఇట్లనుచున్నాడు: "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు, వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9). మనము చూచిన ఈ రెండు వచనములనుబట్టి వ్యర్థమైన భక్తి, వ్యర్థమైన ఆరాధన చేయుట సాధ్యమే యని దేవుడు మనకు విశదీకరించుచున్నాడు. వ్యర్థము అనగా ప్రయోజనములేనిది, పనికిరానిది అని అర్థము గనుక దేవునికి మనము చేయు సేవ ప్రయోజనకరముగా నుండునట్లు మనము జాగ్రత్తపడవలయును. ఆయనకు ప్రీతికరమైన సేవను చేయు నిమిత్తము మనము దేవుని వాక్యమును చదివి తద్వారా దేవుని సేవింప వలయును. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువాని గాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ఈనాడు మనలను హెచ్చరించుచున్నాడు (2తిమో 2:15).

దేవుని ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింపవలెననిన సత్యమును ముందు మనము తెలిసికొనవలెను. సత్యమనగా యేమి? అని మీరడగవచ్చును. దేవుని వాక్యమే సత్యము. "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" అని యేసుప్రభువు దేవుని వాక్యమును గూర్చి పలికెను. మరల ఆయన, "నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను" అని చెప్పుచున్నాడు. గనుక మనము దేవుని ఆరాధించునపుడు దేవుని యొక్కయు, దేవుని కుమారుడైన క్రీస్తు యొక్కయు వాక్యము ననుసరించి ఆరాధింపవలెను.

సత్యము ఎల్లప్పుడు పరిపూర్ణమైనది. పరిపూర్ణ సత్యము దోషములేనిది. అందువలన అది ఎల్లప్పుడు ఏకీభావమునే వ్యక్తపరచును గాని, స్వయం విరుద్ధ సంగతులనది బోధింపదు. సత్యవాక్యమయిన బైబిలును మనము చదువునప్పుడు, అందులో మనకు కన్పడు ఆరాధన క్రమము, ఆరాధన యంతయు ఏకీభావమునే వ్యక్తపరచును గాని, వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు సంగతులనది బోధింపదు. దేవుని వాక్య ప్రకారము లేనిదల్లా అసత్యమని మనము గ్రహింపవలయును. మనము అసత్యమును ద్వేషించి, సత్యమును ప్రేమింపవలెను. అపొస్తలుడైన పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు: "దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనుబరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష కలవారు అందరును శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు. (2థెస్స 2:10-12). దుర్నీతినుండియు పాపము నుండియు మనము విడుదల పొందవలయును. యేసు ఇట్లు చెప్పుచున్నాడు: "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహా 8:31-32). మనము దేవునికి చేయు సేవ లేదా ఆరాధన సత్యవాక్యము ననుసరించి యుండవలెను. నిష్కపట హృదయము మనకు ఉన్నంత మాత్రమున అది సరిపోదు. మనకు తోచినదల్లా దైవారాధనలోనికి మనము తీసికొని రాకూడదు.

మనము చేయు సత్యారాధన యెట్లుండవలెను అని మనము అడుగవచ్చును.

మొదటిగా మన ఆరాధనమూర్తి నిజదేవుడై యుండవలెను. మానవులను కాని, మానవకల్పిత విగ్రహములను గాని మనము ఆరాధించకూడదు. "లోకమందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. దేవతలనబడినవారును, ప్రభువులనబడినవారును అనేకులున్నారు. ఆకాశ మందైనను, భూమిమీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడు ఉన్నాడు. ఆయన తండ్రి; ఆయననుండి సమస్తమును కలిగెను, ఆయన నిమిత్తము మనమున్నాము. మరియు మనకు ప్రభువు ఒక్కడే; ఆయన యేసుక్రీస్తు; ఆయన ద్వారా సమస్తమును కలిగెను; మనము ఆయన ద్వారా కలిగినవారము" (1కొరింథీ 8:4-6). దేవుడు ఆత్మయై యున్నాడు. ఆయన నిర్జీవమైన ఒక విగ్రహము కాదు. అందువలన ఈ ఆత్మయైన దేవుని మనము మన ఆత్మ ద్వారా ఆయన వాక్యజ్ఞానము కలిగి ఆరాధింపవలెను.

మనము ఆరాధించునపుడు మనకును, దేవునికిని సరియైన మధ్యవర్తి యుండలెను. ఈ మధ్యవర్తి భూ సంబంధ యాజకుడు కాదు, గాని ఆయన మన ప్రధాన యాజకుడగు యేసుక్రీస్తే. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తి ఒక్కడే; ఆయన క్రీస్తు యేసను నరుడు" అని బైబిలు బోధించుచున్నది (1తిమో 2:5). "ఆకాశమండలము గుండ వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదుము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు.గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింప బడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను గనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16).

మన ఆరాధన యధార్థముగ నుండుటకు దేవునితో మనము సరియైన సంబంధమును కలిగి యుండవలెను. "ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను,

ఆయన చెవులు వారి ప్రార్ధనలవైపునను ఉన్నవి గాని, ప్రభువు ముఖము కీడు చేయు వారికి విరోధముగా ఉన్నది" (1పేతురు 3:12). "మరియు మన మాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" అని దేవుని వాక్యము చెప్పుచున్నది (1యోహాను 3:22).

ఆరాధన చేయునప్పుడు మనము సరియైన మనస్తత్వము కలిగి ఆరాధించవలెను. అందువలన పౌలు ఇట్లనుచున్నాడు: "కాబట్టి ఆత్మతో పాడుదును, మనస్సుతోను పాడుదును" (1కొరింథీ 14:15). "మరియు మాటచేతగాని, క్రియచేత గాని మీరేమి చేసినను, ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

ఆరాధన చేయునప్పుడు, అందలి క్రియలు సరియైనవి, అనగా దేవుడు కోరినట్టివి అయి యుండలెను. ఆరాధనలో దేవుని మనము కీర్తనలతోను, ఆత్మ సబంధమైన పద్యములతోను స్తుతించవలెనని దేవుడు కోరుచున్నాడు. ఆయన కోరిన స్వరగానమునే మనము అర్పించవలెను గాని యాంత్రిక వాయిద్యములను కాదు (కొలస్స 3:16). ప్రార్ధన చేయుమని ఆయన కోరుచున్నాడు. వాక్యమును బోధించుట, ప్రభురాత్రి భోజనమును ప్రతి ఆదివారమున జరిగించుట, కానుకల నిచ్చుట గూడ ప్రతి ఆదివారమున జరుగవలెనని ఆయన గ్రంధము ద్వారా మనలను హెచ్చరించుచున్నాడు. ఇట్టి క్రియలను సత్యముతోను, ఆత్మతోను చేసిన యెడల మనము దేవుని కర్పించు ఆరాధన యధార్ధమైనదై ఆయనకు ప్రీతికరముగా నుండును (అపొ.కా. 2:42; 1కొరింథీ 16:1-2).

మనము చేయు ఆరాధన అంతయును ఆయన సంఘము ద్వారా చేయవలెను: "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక " (ఎఫెసీ 3:21). నీవు ఆయనను ప్రీతికరముగా ఆరాధించవలెననిన రక్షణ పొందుట అత్యావసరము. రక్షింపబడిన వారినందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు

రక్షింపబడును. గనుక నీవు యేసునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మార్పునొంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుటకు తడవు చేయవద్దు. ఆయన ఇచ్చు ఉచిత రక్షణను ఈనాడే తప్పక నీవు అంగీకరించుదువు అని నా విశ్వాసము (అపొ.కా. 2:47; మార్కు 16:16; అపొ.కా. 22:16).

## ఆరాధనామూర్తి
## ( The Object of Worship )

దేవునినిగాని లేక ఒక పరిశుద్ధమైన పవిత్రమైన మూర్తిని గాని భక్తిపూర్వకముగా పూజించి గౌరవించుట 'ఆరాధన' యని అనవచ్చును. మానవుడు ఆత్మీయౌన్నత్యమును పొందుట కది ఒక క్రియమై యున్నది. మానవుడు భగవంతునితో లీనమగుటకు 'ఆరాధన' ఒక సాధనమై యున్నది. దేవుని గ్రంథమైన బైబిలు, ఆరాధనకొక గొప్ప ప్రాముఖ్యత నొసగుచున్నది. ఆరాధన యను పదము బైబిలునందు ఇంచుమించు 191 మారులు ఉపయోగింపబడెను. అది పాత నిబంధనలో 113 మారులు, క్రొత్తనిబంధనలో 78 మారులు కన్పడును.

ఆదినుండియు మానవులు దేవుని నారాధించు స్వభావము కలవారని చరిత్ర మనకు తెలియజేయుచున్నది. మానవునికంటె దేవుడ మిన్నమైన వాడనియు, శక్తిమంతుడు అనియు వారు గ్రహించినందున వారాయన నారాధింప మొదలిడిరి. అయితే మానవుడు స్వభావికముగా ఆరాధించుట ఎట్లో ఎరుగనివాడు. ఆదిలో దేవుడు మానవునితో ప్రత్యక్ష సంబంధమును కలిగి యుండిన కాలములో ... మానవునికి ఆరాధించు విధానమును గరపియుండెననుట నమ్మతగినది. పరిశుద్ధుల సభలో ఆయన మిక్కిలి భీకరుడని దేవుని గూర్చి బైబిలు ప్రకటించుచున్నది. "మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి. ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు" (కీర్తన 99:5).

దేవుడెవరు ? ఆయన ఎక్కడనుండి వచ్చెను? అను ప్రశ్నలను మనము తరుచు ఎదుర్కొనుచూ యుందుము. ఇట్టివానికి జవాబు చెప్పుట కూడ అంత

సులభమయిన పని కాదు. బ్రహ్మాండమైన ఈ విశ్వమంతయును ఎట్లు కలిగెనో అది మానవ ఊహాతీతమైనది. గంభీరమైన విశ్వమంతటికిని కారణమైన ఒక ఆదిశక్తి యుండి తీరవలెను. అయితే ఆ శక్తి ఎవరు ? ఏదైన నిర్జీవమైన దానినుండి జీవముద్భవించుట అసాధ్యము గనుక ఆశక్తి సజీవుడైనవాడై యుండలెను. అందు వలన ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణమైనవనియు, అందును బట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడిలేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము. దేవుడు ఆదియును అంతమునై యున్నాడని బైబిలు బోధించుచున్నది. ఆయన అనంతము నుండి అనంతమువరకు ఉన్నట్టివాడు. ఆయన ఎల్లప్పుడూ ఉండువాడు. అట్టి గంభీరమైన వానిని అంగీకరించుచు మానవులు ఆయనను భక్తి పూర్వకముగా గౌరవించుట మొదలిడిరి. ఆదిలో మానవులు ఒకే దేవుని ఆరాధించెడివారని చరిత్ర కూడ మనకు బోధించుచున్నది. ఆ తరువాత దినములు గడచిన కొలది మానవులు సత్యమార్గమునుండి తొలగి పోయి వారి ఇచ్ఛాను సారముగ దేవుండ్లను సృజించి పూజించిరి.

నేడు మానవులు దేవుండ్లవలె పూజించుకొన్ని సంగతులను మనమిప్పుడు పరిశీలించుదాం. పురాతన మైనట్టియు నమ్మతగినట్టియునగు బైబిలు గ్రంధము ననుసరించి మన పరిశీలన కొనసాగించుదాం.

## ప్రకృతి - ఆరాధనామూర్తి ?

ప్రపంచములో ప్రకృతి నారాధించువారున్నారు. కొందరు ప్రాతః కాలముననే లేచి తూర్పు దిక్కుననున్న ఆ గంభీర సూర్యగ్రహమును మ్రొక్కుదురు, దాని వెనుక నున్న సృష్టికర్తను జ్ఞప్తికి తెచ్చుకొనకుండగ వారు దానినారాధింతురు. అయితే మానవుడు ప్రకృతిని ఆరాధించుట యుక్తమైన పనియేనా ? ఈ ప్రకృతి అంతయును దేవునిచే సృష్టింపబడెనని బైబిలు చెప్పుచున్నది. ప్రకృతి దేవుని సృష్టియై యున్నది. సూర్యుని, చంద్రుని, భూమిని, నక్షత్రములను మనము చూస్తూ యుంటాము. అయితే వాటన్నిటికిని సృష్టి కర్తయనే వాడెవడూ లేకనే అవి అకస్మాత్తుగా వచ్చిపడెననుట బుద్ధిహీనత యగును. సర్వసృష్టికిని కర్తయైన వాని

న్నెరిగి ఆయనను పూజించుటకు బదులు, కొందరు సృష్టమునే పూజించుచున్నారు. దైవసృష్టి అంతటి మీదను భూమిపై మానవునికి దేవుడు అధికారము అనుగ్రహించెనని, బైబిలు నుడువుచున్నది. మానవుడెల్లప్పుడు దేవునికి భయపడి, ఆయనను పూజించు నిమిత్తము సృష్టింపబడెను. అందువలన సృష్టికర్తకు బదులు సృష్టిని మనము పూజింపరాదు. "అట్టి వారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి" యని బైబిలు చెప్పుచున్నది (రోమా 1:25).

## మానవసృష్టి - ఆరాధనామూర్తి ?

మానవుడు దైవసృష్టిని పూజింపరానియెడల అతడు మానవ సృష్టినే పూజింపవచ్చునా ? మన స్వహస్త కృతము లైనదానిని దేనినికూడ దేవుని వలె యంగీకరించుట మానవ జ్ఞానమునకు భిన్నముగ నున్నది. దేవుడు మానవుని సృజించెను గాని మానవుడు దేవుని సృజించలేదు. నేటి ప్రపంచములో అనేకులు బంగారు వెండి రాతి విగ్రహములను ఆరాధించువారున్నారు. అయితే ఈ విగ్రహములన్నియును మానవ కల్పిత హస్తకృతములని మరచిపోకుడి. ఇప్పుడు వీని విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నదో విందము : "అన్యజనుల విగ్రహములు వెండి బంగారువి, అవి మనుష్యుల చేతిపనులు. వాటికి నోరుండియు పలుకవు. కన్నులుండియు చూడవు. చెవులుండియు వినవు. వాటి నోళ్ళలో ఊపిరి లేశమైనను లేదు. వాటిని చేయువారును, వాటియందు నమ్మికయుంచు వారందురునువాటితో సమానులుగుదురు" (దా,కీర్త 135:15-18).అపొస్తలుడైన పౌలు ఒక మారుఏథెన్సు అను పట్టణమున కేగెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మ పరితాపము పట్టలేకపోయెను. నిజ దేవునిని గూర్చిన సత్యమును అతడు వారికిట్లు బోధించెను: "ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతాభక్తి గలవారైయున్నట్టు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద - తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో, దానినే నేను మీకు

ప్రచురపరచుచున్నాను. జగత్తును, అందలి సమస్తమును నిర్మించిన దేవుడు, తానే ఆకాశమునకును, భూమికిని ప్రభువై యున్నందున, హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును, ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక, తనకు ఏదైనను కొదువ యున్నట్లు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు. మరియు యావద్భూమి మీద కాపుర ముండుటకు ఆయన యొకనినుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు యొకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును, వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను. ఆయన మనలో ఎవనికిని దూరముగా నుండువాడు కాడు. మనమాయన యందు బ్రతుకుచున్నాము. చలించుచున్నాము. ఉనికిని కలిగియున్నాము. అటువలె మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరు చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పన వలన మల్చబడిన బంగారమునైనను వెండినైనను రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంప కూడదు'' (అపో.కా. 17:22-29). గనుక మిత్రులారా, మానవ హస్తకృతములగు విగ్రహములు దేవుండ్లు కావనియు, వాటిని మనము పూజింప రాదనియు గ్రహించుడి.

## మానవుడు దైవమా ?

మనము దైవ సృష్టిని కాని, మానవసృష్టిని గాని ఆరాధించరాని యెడల మన సాటి మానవుని పూజింపవచ్చునా? ఈ ప్రశ్నను కొంతసేపు జాగ్రత్తగా ఆలోచించుడి. నీ పొరుగువానిని దేవునివలె నెంచుచు, నీవు అతనికి చేయు సేవను ఉదాహరణ కొరకు ఊహించుము. నీ సాటి మానవుడే దేవుడయిన యెడల అతడు చేయు పనులలో నీవు చేయరాని వేమి? జీవిత స్థాయిలో అతడు నీకంటె మిన్నయైనవాడా? కాదు. అతడు నీతో సాటియైన వాడేగదా? అయితే అట్టివానిని కూడ మనము దేవుడని పూజింపరాదు. ఒకసారి కొర్నేలి యను భక్తిపరుడు అపొస్తలుడైన పేతురు నారాధింప మొదలిడిన సంగతి బైబిలునందొకటి వ్రాయబడియున్నది. పేతురు

దేవునిచే ఏర్పరచుకొనబడిన వాడని అతడెరుగును. రక్షకుడైన యేసుక్రీస్తును గూర్చి మరింత విపులముగ వినునట్లు కొర్నేలి దేవుని దూత ఆజ్ఞానుసారముగ పేతురును తన యింటికి పిలిపించెను. అయితే పేతురు అతని యింటికి రాగానే కొర్నేలి తనకున్న గౌరవమును మిన్నగా ప్రకటింపనెంచి అతని పాదములపై పడెను. అయితే పేతురు పరిశుద్ధాత్మ ద్వారా "లేచి నిలువుము, నేనుకూడ నరుడనే" అని పలికెను. ఇంకొక మాటలో మానవుడు సాటి మానవుని ఆరాధించుటకు దేవుడు ఖండించెనని మనము గ్రహించుకొనవలసి యున్నది (అపొ.కా. 10:26).

## దూతల నారాధింపవచ్చునా ?

పైన చెప్పబడిన మూడింటిని మనము ఆరాధింపరాని యెడల, దేవుని దూతలను ఆరాధింపవచ్చునా? అపొస్తలుడైన యోహాను ఒకమారు దేవునిదూతను పూజించుచు నమస్కరింప మొదలిడగా, అతడు తిరస్కరింపబడెను. ఈ విషయమై యోహాను ఇట్లు వ్రాయుచున్నాడు. "యోహానను నేను ఈ సంగతులను వినినవాడను, చూచినవాడను. నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూతపాదముల యెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా, అతడు వద్దుసుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను ఈ గ్రంథమందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను. దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను" (ప్రకటన 22:8-9). అలాగని మనము సాతానుని సేవింపరాదండి! సాతానుడు దైవ వ్యతిరేకి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తుపై తన అస్త్రముల నతడు ప్రయోగింప యత్నించె నొకసారి. అయితే "సాతానా, పొమ్ము. ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నదని" చెప్పి క్రీస్తు వానిని ఖండించెను (మత్తయి 4:10).

ఇంతవరకును మానవులు ఆరాధించు ఆయా సంగతులను మనము పరిశీలించి యుంటిమి. ప్రభువైన దేవుని తప్ప మరి ఎవనిని మనము పూజించి, సేవింపరాదని నేర్చుకొంటిమి. దైవ మానవ సృష్టములను కాని, సాటి మానవునికాని, దేవదూతను గాని, చివరకు సాతానుని కాని మనము ఆరాధించరాదని గ్రహించితిమి.

అయితే బైబిలు బయలుపరచు దేవుడు ఏమి పలుకుచున్నాడో ఇప్పుడు విందము. నిర్గమకాండము 20వ అధ్యాయము 2వ వచనము నుండి 6వ వచనము వరకు చదువుదము. "నీ దేవుడైన యెహోవాను నేనే.... నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని క్రింది భూమియందే గాని భూమి క్రింద నీళ్ళ యందే గాని యుండుదేని రూపమునయినను, విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవానగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించు వారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషము కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి, నా ఆజ్ఞలను గైకొను వారిని వెయ్యి తరముల వరకు కరుణించువాడనై యున్నాను".

పరమందున్న అట్టి నిజ దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని ఆయన మనకు బోధించెను. నిజానికి బైబిలు బయలుపరచు దేవుడు నిజమైన వాడే. "దేవతలనబడిన వారును ప్రభువులనబడినవారును అనేకులున్నారు. మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి. అయితే అందరియందు ఈ జ్ఞానము లేదని" పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా పలికెను (1కొరింథీ 8:5-7). సత్య దేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవమని యేసుక్రీస్తు చెప్పెను (యోహాను 17:3).

గనుక ప్రియమిత్రుడా! నీ ఆరాధనామూర్తి యెట్టిడాడు ? ఆయన సజీవుడైన దేవుడా ? కానియెడల నీవు తప్పక బైబిలు గ్రంధమును పఠించుము. నీవు దేవుని నారాధించుచున్న యెడల, ఆ దేవుడు బైబిలు చెప్పునట్టి సజీవుడైన దేవుడు కానియెడల, నీ ఆరాధన వ్యర్థమని గ్రహించుము. ఇదియే నా ప్రేమ పూర్వకమైన హెచ్చరిక!

# క్రొత్త నిబంధన ప్రకారమైన ఆరాధన
# ( Worship according to the New Testament )

మానవులందరు ఏకైక నిజదేవుని ఆరాధించాలి. "ప్రభావ మహాత్మ్యములను యెహోవాకు ఆరోపించుడి. యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి" (కీర్తన 29:2). "ఆయన మన దేవుడు మనము ఆయన పాలించు ప్రజలము ఆయన మేపు గొఱ్ఱెలము. రండి నమస్కారము చేసి సాగిలపడుదము" (కీర్తన 95:6,7). యేసు జన్మించినప్పుడు తూర్పుదేశపు జ్ఞానులు ఆయనను ఆరాధించుటకు వెళ్లిరని బైబిలుచెప్పుచున్నది (మత్తయి 2:2). ప్రభువైన దేవునిని మాత్రమే ఆరాధింపవలెనని యేసుక్రీస్తు సాతానుకు చెప్పారు (మత్తయి 4:4).

క్రైస్తవులు సర్వశక్తుడైన దేవుని క్రీస్తు ద్వారా ఆరాధిస్తారు. దేవుడు సమస్తాధి కారాన్ని తన కుమారుడైన క్రీస్తుకు యిచ్చారు. (మత్తయి 28:8). "మాటచేత గాని, క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరిట చేయుడి" యని బైబిలు చెప్పుచున్నది (కొలస్స 3:17).

యోహాను 4:21-24లో యేసు సమరయ స్త్రీతో మాట్లాడుచు, దేవుని ఎక్కడైనా సరే ఆరాధించు సమయం వచ్చుచున్నదని తెలియజేసారు. పాత నిబంధన కాలములోని యెరూషలేము ఇకమీదట ఒక ప్రత్యేక ఆరాధన స్థలముగా నుండదు. ఆయనను హృదయ పూర్వకముగా ఆరాధించువారు కావలెనని దేవుడు కాంక్షించుచున్నాడు. ఆరాధన హృదయ పూర్వకమైనదై దేవుడిచ్చిన మాదిరిని బట్టి యుండును. దేవుని వాక్యములో ఇయ్యబడిన ఆరాధన మాదిరిని ఒకడు అంగీకరించని యెడల, అతని ఆరాధన వ్యర్థము. ఏలయనగా అతని ఆరాధన దేవుని అనుమతి బడసినది కాదు.

మనము దేవుని ఎట్లు ఆరాధించాలని ఆయన కోరుచున్నాడు ? 1. మనం ఆయనను ఆత్మతో ఆరాధించాలి. 2. సత్యముతో ఆరాధించాలి (యోహాను

4:24). దేవుని ఆత్మతో ఆరాధించుట యంటే, సరియైన మనస్తత్వం కలిగి ఆరాధించుట యని అర్ధము. మన ఆరాధన హృదయ పూర్వకమైనదై ఆత్మ సంబంధమైన ఆరాధనయగును. మనం చేయు దానిని అర్ధం చేసుకొని ఆరాధించుట ఆత్మతో ఆరాధించుట యగును. మన ఆత్మీయ ఆరాధనకు బైబిలే మార్గదర్శి యగును

దేవుని సత్యముతో ఆరాధించుట యంటే ఆయన సత్యవాక్యములో, యిచ్చిన ఆరాధనాంశములను బట్టి ఆరాధించుట యని అర్ధము. లేఖనములే సత్యము! "సత్యమునందు వారిని ప్రతిష్ట చేయుము; నీ వాక్యమే సత్యము" (యోహాను 17:17).

యోహాను 4:24లో క్రీస్తుయొక్క హెచ్చరికలను మనం పాటించాలి. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెను". మన ఆరాధన అంగీకరింపబడాలంటే అది ఆత్మతోను, సత్యముతోను యుండాలి.

**క్రొత్త నిబంధన ప్రకారమైన ఆరాధనలో మనం వారములో మొదటి దినమున అనగా ఆదివారమున ఆరాధనకు కూడుకొనాలి. మనం ఆరాధనకు ఆదివారమున కూడుకొన్నప్పుడు ఆరాధనలో దేవుడు ఐదు ఆరాధనాంశములను మననుండి కోరుచున్నారు :**

**1. పాటలు పాడాలి :** దేవునిని యదార్ధముగా ఆరాధించు క్రైస్తవులు "సంగీత ములతోను కీర్తనలతోను ఆత్మ సంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్దిచెప్పుచు, కృపాసహితముగా తమ హృదయములలో దేవుని గూర్చి గానము చేయుదురు" (కొలస్స 3:16). ఎఫెసీ 5:19ని కూడా చదువుము. యిది సంఘపరమైన సంగీతము అంటే ప్రతి క్రైస్తవుడు దేవుని గూర్చిన పాటలు పాడాలి. వాద్య సంగీతమును క్రొత్త నిబంధన ఆరాధనలో దేవుడాజ్ఞాపించలేదు.

2. ప్రార్ధన చేయాలి : "యెడతెగక ప్రార్ధన చేయుడి" యని బైబిలు చెప్పుచున్నది (1థెస్స 5:17). దేవుని నారాధించుటకు మనం కూడివచ్చినప్పుడు మనం తప్పక ప్రార్ధించాలి. క్రొత్త నిబంధన క్రైస్తవులు ఆరాధనకు కూడి వచ్చినప్పుడు ప్రార్ధన చేసారు, "వారు అపొస్తలుల బోధయందును, సహవాసమందును రొట్టె విరుచుట యందును, ప్రార్ధన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42).

3. వాక్యము బోధింపబడాలి : శిష్యులు కూడివచ్చినప్పుడు వాక్యము బోధింపబడినట్లు బైబిలు చెప్పుచున్నది. వారు అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి. ఆరాధనకు కూడివచ్చినప్పుడు పౌలు మరునాడు వెళ్లనైయుండి,వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను అని వ్రాయబడి యున్నది (అపొ.కా. 20:7).

4. ప్రభురాత్రి భోజనము : క్రీస్తు యొక్క శిష్యులు ఆదివారమున రొట్టెవిరుచుటకు కూడి వచ్చిరి (అపొ.కా, 20:7). యిది ప్రభురాత్రి భోజనము. దీనిని మన ప్రభువైన యేసుక్రీస్తే ఆరంభించెను. "వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని దాని నాశీర్వదించి విరిచి తన శిష్యులకిచ్చి మీరు తీసికొని తినుడి, యిది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి వారికిచ్చి దీనిలోనిది మీరందరు త్రాగుడి . ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పెను (మత్తయి 26:26-28).

5. కానుకలియ్యాలి : క్రైస్తవులు దేవుడు వారిని ఆశీర్వదించిన కొలది కానుకలిచ్చినట్లు క్రొత్త నిబంధన చెప్పుచున్నది. అపొ.పౌలు ఇట్లు వ్రాసాడు: "పరిశుద్ధుల కొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1కొరింథీ 16:1,2).

మనం ఆదివారమున కూడి వచ్చినప్పుడు ఆరాధనలో చేయవలసిన ఈ ఐదు అంశములను గూర్చి క్రొత్త నిబంధన మనకు బోధించుచున్నది. కొందరు చేయు ఆరాధన వ్యర్థమును (మత్త 15:9), తెలియని ఆరాధనయును (అపొ.కా. 17:23), స్వేచ్ఛారాధనయునగును (కొలస్స 2:23). మనం దేవుని వాక్యాన్ని అనుసరించిన యెడల మన ఆరాధన ఆత్మతోను, సత్యముతోను యుండును. అప్పుడు దేవుడు మనలను ఆశీర్వదిస్తారు. దేవుడిచ్చిన ఆరాధనాంశములను మనం మార్చరాదు. దేవుడు బైబిలులో యేమి చెప్పారో దానినే చేయుటలో మనం సంతృప్తి జెందాలి. దేవుని మార్గాన్ని ఏ విధముగాను మార్చుటకు మనం ఎన్నడు ప్రయత్నం చేయకూడదు (లేవీ 10:1, 2 ; గలతీ 1:6-10; ప్రక 22:19).

- స్టీవ్ మిల్లర్ (TFW)

## నాలుగు రకములైన ఆరాధన
## ( Four Kinds of Worship )

దేవుని మనము ఆరాధించునప్పుడు ఆయన వాక్యము చొప్పుననే ఆరాధించవలెనని తెలిసికొంటిమి. ఆరాధన చేయునప్పుడు మన ఆరాధనామూర్తి నిజదేవుడై యుండవలెనని, మన మనస్తత్వం సరియైనదై యుండవలెనని కూడా ఇదివరకు మనము తెలిసికొనియున్నాము. అట్లు కానియెడల మనము దేవునికి చేయు ఆరాధనయంతయును ప్రయోజన శూన్యమగును. దేవుని ఆరాధన చేయుటలో నిమగ్నులైన మానవులు ఈనాడు ప్రపంచమందు ఉన్నారు. అయితే వారందరి ఆరాధన దేవునికి ఇష్టపూర్వకమైనది కాదు అని దైవ గ్రంథము వలన మనము గ్రహించుకొనవచ్చును. ఈనాడు మానవులు దేవునికి చేయు ఆరాధన కనీసము 4 రకములుగా నున్నది. క్రొత్త నిబంధన గ్రంథమును బట్టి మనము ఒక్కొక్క దానిని పరిశీలించుదము.

మొదటిది వ్యర్థారాధన : నేడు క్రైస్తవులమని చెప్పుకొనుచు దేవుని ఆరాధించు వారిలో ఎక్కువమంది చేయు ఆరాధన వ్యర్థమైనది. మత్తయి వ్రాసిన సువార్త 15 అధ్యాయము, 7వ వచనమునుండి 9వ వచనము వరకు మనము చదివిన యెడల, యేసు ఇట్లనుచున్నాడు : "ఈ ప్రజలు తన పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు." ఒకనాడు యెరుషలేము నుండి శాస్త్రులును, పరిసయ్యులును యేసునొద్దకు వచ్చి, నీ శిష్యులు చేతులు కడుగుకొనకుండ భోజనము చేయుచున్నారే, వారెందు నిమిత్తమె పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించుచున్నారు ? అని అడిగిరి. అందుకాయన - మీరును మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞనూ ఎందుకు అతిక్రమించుచున్నారు ? ... మీరు మీ పారంపర్యాచారము నిమిత్తము దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు... మనుష్యులు కల్పించిన పద్ధతులను దేవుని ఉపదేశములే యని బోధించుచు మీరు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని యేసు వారిని హెచ్చరించెను.

నేటి క్రైస్తవలోకము నిజానికి ఆనాటి యూదులకు ఏమియును తీసిపోలేదు. యేసుక్రీస్తు కాలమునాటి యూదుల వలె నేడు క్రైస్తవ ఆరాధనలోనికి, ఆచరణలోనికి అనేకమైన పారంపర్యాచారములను తీసికొనివచ్చుట జరిగినది. భోజనము చేయుటకు ముందు చేతులు కడుగుకొనుట మంచిదే. అయితే చేతులు కడుగుకొనుటయే ఒక ఆరాధన క్రియగా చేయుట దోషము అగును. మనుష్యులు కల్పించిన సిద్ధాంతములు, బోధలు, ఆచారములు నేడు క్రైస్తవలోకము నందెన్నియో ఉన్నవి. వాటన్నిటిని బట్టి మనము చేయు ఆరాధన నిజానికి ప్రయోజన శూన్యమైనది, పనికిరానిది, వ్యర్థమైనది యని మనము గ్రహించవలెను. పెద్దల పారంపర్యాచారమును బట్టి మనము దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నాము అని యేసు చెప్పుచున్నారు (మత్తయి 15:7-9).

గనుక మిత్రులారా, మీ ఆరాధన క్రమమును, మీ ఆరాధన క్రియలను ఒకసారి దేవుని వాక్యముతో సరిపోల్చి చూడుడి. వాక్య ప్రకారము లేకుండా,

తరతరాలనుండి చేయుచున్న క్రియలు అందులో మీకు ఎన్నో కన్పడగలవు. అట్టివి లేనియెడల చాల సంతోషమే గాని, అట్టివి ఉన్నయెడల వాటిని తొలగించి, దేవుని వాక్య ప్రకారము మీ ఆరాధన జరుగునట్లు చూడుడి. ఒకవేళ వాక్యము చెప్పుచున్న క్రియలను కొన్నిటిని మీరు జరిగించుట లేదేమో. వాటిని తప్పక మీరు చేయులాగున జాగ్రత్తపడుడి.

రెండవదిగా, మనము తెలియని ఆరాధనను కనుగొనగలము. అపొస్తలుడైన పౌలు ఒకసారి ఏథెన్సు అను పట్టణమునకు వెళ్ళెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మ పరితాపము పట్టలేక పోయెను. అపొ.కా. 17:22,23 వచనములలో మన మీవిధముగా చదువగలము: "పౌలు అరెయొపగు మధ్యను నిలిచి చెప్పిన దేమనగా - ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతా భక్తి కలవారై యున్నట్లు నాకు కనబడుచున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడి యున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తిని కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను."

ఏథెన్సు పట్టణస్థులు భక్తిని కలిగియున్నారు. గాని వారు నిజదేవుని నెరుగనందున వారు "తెలియని ఆరాధనను" జరుపుచున్నారు. అట్టివారి మూఢభక్తిని దేవుడు గౌరవించడు. మూఢనమ్మకము చొప్పున చేయు ఆరాధన దేవునికి ఇష్టము కాదు. "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించు వాని ప్రార్థన హేయము" అని సామెతలు 28:9లో వ్రాయబడియున్నది. అందువలననే దేవుని యథార్థముగా ఆరాధించువారు, "ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" అని ఆయన కోరుచున్నాడు. ఏథెన్సు వారివలె మనము చేయు తెలియని ఆరాధనను ఇకమీదట దేవుడు సహించడు ఆయన ఇట్లు చెప్పుచున్నాడు : "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి, చూడనట్టుగా నుండెను; ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30).

మూడవది, స్వేచ్ఛారాధన : ఇది కొలస్సయులకు వ్రాసిన పత్రిక 2:20-23 వరకు ఉన్న వచనములలో వివరింపబడినది. "మీరు క్రీస్తుతో లోకముయొక్క మూల పాఠముల విషయమై మృతి పొందినవారైతే, లోకములో బ్రతుకుచున్నట్టుగా మనుష్యుల ఆజ్ఞలను, పద్ధతులను అనుసరించి చేతపట్టుకొనవద్దు, రుచిచూడవద్దు, ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల ? అవన్నియు వాడుకొనుటచేత నశించిపోవును. అట్టివి స్వేచ్ఛారాధన విషయములలోను, వినయ విషయములలోను దేహశిక్ష విషయములలోను, జ్ఞానరూపక మైనవని యెంచబడుచున్న వేగాని, శరీరేచ్ఛా నిగ్రహ విషయములో ఏ మాత్రమును ఎన్నిక చేయతగినవి కావు".

స్వేచ్ఛారాధన యనునది మానవేచ్ఛలను బట్టి ఆరంభమైన క్రియలను సూచించుచున్నది. ఆ పదము భక్తిని సూచింపవచ్చునేమో గాని, ఆ భక్తి లేఖనములను అనుసరించి లేనప్పుడు అది ఖచ్చితముగా దేవునికి అంగీకార యోగ్యము కానిదగును.

ఆఖరిగ మనమ క్రొత్త నిబంధనలో సత్యారాధన గూర్చి చూడగలము. యోహాను 4:24 లో యేసుక్రీస్తు యిట్లనుచున్నాడు: "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను." ఆత్మతో ఆరాధింపవలె మన్నపుడు మనము ఆత్మజ్ఞానము గలవారమై నిష్కపటముగ ఆరాధింపవలెను. సత్యముతో ఆరాధించుటకు మనము సత్యవాక్య మేమి చెప్పుచున్నదో దానిని బట్టి చేయవలెను. ఒకవేళ మనము వాక్యప్రకారమే ఆరాధనను జరిగించుచున్నను, దానిని కోపబుద్ధితోను, దేవదూషణతోను, గర్వముతోను జరిగించిన, అట్టి ఆరాధన దేవునిచే తిరస్కరింపబడును. ఒకవేళ మనము ఆత్మ జ్ఞానము కలిగి, లేఖనముల ప్రకారము ఆరాధనను జరిగించకుండిన యెడల అట్టి ఆరాధన కూడా తిరస్కరింపబడును. "సత్యము నందు వారిని ప్రతిష్టచేయుము, నీ వాక్యమే సత్యము" అని యోహాను 17:17లో యేసు చెప్పెను. గనుక మనము దేవుని నారాధించునప్పుడు నిర్మలమైన బుద్ధిని, ఆత్మజ్ఞానమును కలిగినవారమై యుండవలెను; సరిగదా మన ఆరాధనను సత్యవాక్య ప్రకారము జరిగించవలెను. దానికి తక్కువగా గాని, ఎక్కువగాగాని చేయకూడదు.

క్రొత్త నిబంధనను చదువునప్పుడు ఆదిమ క్రైస్తవులు ఆరాధనలో కనీసం అయిదు సంగతులను జరిగించినట్లు మనము కనుగొనగలము. ఈనాడు మనము చేయు ఆరాధన, ఆదిమ క్రైస్తవులు చేసిన ఆరాధనతో సరిపోవు చున్నదో లేదో కూడ మనము పరిశీలించుట మంచిది.

1. ఆదిమ క్రైస్తవులు దేవుని వాక్యమును ధ్యానించుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7లో పౌలు ఒక కూటములో ప్రసంగించుట మనమ చూడగలము.

2. వారు ఆరాధనలో ప్రార్ధన చేయుటకు కూడుకొనిరి. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందు, సహవాసమందు, రొట్టె విరుచుట యందు, ప్రార్ధన చేయుటయందు ఎడతెగక యుండిరి (అపొ.కా. 2:42).

3. వారు దేవునికి స్తుతిగానములు చేయుటకు కూడుకొనిరి. ఆరాధనలో వారు కీర్తనలు, ఆత్మ సంబంధమైన పాటలు మాత్రమే పాడిరి. గాని వాయిద్యములను వినియోగించలేదు. దయచేసి మీరు కొలస్స 3:16, ఎఫెసీ 5:19 చదవండి.

4. ఆదిమ క్రైస్తవులు ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనమునందు పాలు పొందుటకు కూడుకొనిరి (అపొ.కా. 20:7).

5. తరువాత,వారు వర్ధిల్లిన కొలది దేవునికి కానుకల నిచ్చుటకు కూడుకొనిరి (1కొరింథీ 16:1-2). లేఖనములు బయలుపరచు సత్య ఆరాధన యిది. మీరు చేయు ఆరాధన ఇట్లు లేనియెడల ఎక్కడో కొంత దోషము ఉన్నదని మీరు ఇట్టే గమనించగలరు. వాక్యమును బట్టి దానిని సరిదిద్దుకొందురని నా నిరీక్షణ.

దేవుని మనము ఆయన సంఘము ద్వారా ఆరాధించవలెను. "నమ్మి బాప్తిస్మము పొందిన'' ప్రతి వానిని ప్రభువు తన సంఘమందు చేర్చును. మీరు ఈనాడే ఆయన సువార్తకు లోబడి, ఆయనను ఆయన సంఘము ద్వారా మహిమ పరచుటకు సిద్ధపడవలెనని నా కోరికమై యున్నది !! (మార్కు 16:16; ఎఫెసీ 3:21).

# ఆరాధన దినము

# ( The Day of Worship )

క్రైస్తవులు దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన ఎట్లు చేయవలెనో ఇదివరకు మనము నేర్చుకొంటిమి. అయితే ఈ ఆరాధనను క్రైస్తవులు ఏ దినమున చేయవలెను? ప్రతి వారములోను ఏడు దినములున్నవి గదా. అయితే ఏదయినా ఒక దినము ఆరాధన దినముగ ప్రత్యేకింపబడెనా ? దీని విషయమై బైబిలు ఏమి బోధించుచున్నదో ఇప్పుడు తెలిసికొందము.

## సబ్బాతు యూదుల ఆరాధన దినము

పాత నిబంధన ప్రకారము యూదుల ఆరాధన దినము సబ్బాతు దినమై యుండెనని మన మెరుగుదుము. అది, వారములో ఏడవదినమని కూడా మన మెరుగుదుము (నిర్గమ 20:8-11). కాని వాస్తవముగ మనము ఇప్పుడు పాత నిబంధన కాలమందు లేము. మోషే ధర్మశాస్త్రము యూదులకు మాత్రమే ఇయ్యబడెను (ద్వితీ 5:1-3). మనకు ఇయ్యబడిన ధర్మశాస్త్రముకంటె అది వేరైనది. అది నెరవేర్చబడినది, తొలగించబడినది. గనుక మనము సబ్బాతు దినమును ఆచరింప వలసిన పనిలేదు."ధర్మశాస్త్రము మోషే ద్వారా అనుగ్రహింపబడెను; కృపయు, సత్యమును యేసుక్రీస్తు ద్వారా కలిగెను" (యోహాను 1:17). యేసుక్రీస్తు ద్వారా కలిగిన క్రొత్త నిబంధన మనకొక క్రొత్త ఆరాధన దినము నిచ్చెను. ఇప్పుడు మనము దేవుని, వారములో ఆఖరి దినమున కాదుగాని, మొదటి దినముననే ఆరాధింపవలెనని దేవుడు కోరుచున్నాడు.

యేసుక్రీస్తు ఒక యూదునివలె జన్మించెను. యూదునివలె జీవించెను. మోషే ధర్మశాస్త్రకాలమున ఆయన జీవించెను. గనుక ఆయన సబ్బాతు నాచరించెను. అయితే ఆయన బోధలలో మనము సబ్బాతు నాచరింపవలెనని ఒక్కసారి కూడ ఆయన ఆజ్ఞ ఇయ్యలేదు. సరిగదా "విశ్రాంతి దినము మనుష్యుల కొరకే నియమింపబడెను గాని మనుష్యులు విశ్రాంతి దినముకొరకు నియమింపబడలేదు.

అందువలన మనుష్య కుమారుడు (యేసుక్రీస్తు) విశ్రాంతి దినమునకు ప్రభువై యున్నాడని" ఆయన బోధించెను (మార్కు 2:23-28).

క్రీస్తు సంఘము స్థాపించబడిన తరువాత అపొస్తలులు కూడ సబ్బాతు నాచరించలేదు. దాని నాచరింపవలెనని పరిశుద్ధాత్మ ద్వారా వారు ఆజ్ఞాపించలేదు. అపొస్తలులలో కొందరు సబ్బాతు దినమున యూదుల సమాజమందిరముల లోనికి వెళ్లిరి గాని ఆరాధించుటకు వారు వెళ్ళలేదు. పాత నిబంధనలోనుండి క్రీస్తును ఎత్తి యూదులకు చూపించు నిమిత్తము, యేసుక్రీస్తు సువార్తను యూదులకు విశదముగా బోధించు నిమిత్తము వారు వెళ్లిరి.

## క్రైస్తవుల ఆరాధన దినము

అపొస్తలులును, ఆదిమ సంఘస్థులును దేవుని నారాధించుటకు ఆదివారమున, అనగా వారములో మొదటి దినమున కూడుకొనినట్లు క్రొత్త నిబంధన మనకు బోధించుచున్నది. అపొ.కా. 20:7లో మనము చూచిన, "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి, వారితో ప్రసంగించుచు, అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను" అని వ్రాయబడియున్నది. అందువలన ఈనాడు క్రైస్తవులయినవారు దేవుని ఆదివారముననే ఆరాధించవలెను గాని శనివారమున కాదు అని గ్రహించవలెను.

దేవునికి అంగీకారయోగ్యమైన ఆరాధన మనము చేయునప్పుడు కానుకలిచ్చుట కూడ అందొక భాగమై యున్నదని మనము ఇదివరకే నేర్చుకొనియున్నాము. ఈ కానుకలను ఆరాధన దినమైన ఆదివారమున మనము సమర్పించవలెనని దైవ వేదము బోధించుచున్నది. 1కొరింథి 16:2లో "నేను వచ్చినపపడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" అని పరిశుద్ధాత్మా వేశము వలన అపొస్తలుడైన పౌలు వ్రాసియున్నాడు. ఆదివారముననే క్రైస్తవులు కానుకల నెందుకీయవలెను ? క్రైస్తవులందరు దేవుని నారాధించుటకు ఆ

దినమున కూడుకొందురు గనుక కానుకలిచ్చుటకూడ అది అనుకూల సమయమై యున్నది. దీనివలన ఆదివారమే ఆరాధన దినమని మనకు విశదమగుచున్నది.

అంతేకాదు. క్రైస్తవులందరు సంఘముగా కూడుకొని దేవుని నారాధించుటకు వారములో మొదటి దినము దేవునిచే నిర్ణయించబడినది. అందువలన "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా ఆలాగున చేయుడి" యని హెబ్రీ 10:25లో క్రైస్తవులకు ఒక హెచ్చరిక ఈయబడినది. కొందరు మానుకొనుచున్నట్టుగా వారు సమాజపముగా కూడుట మానరాదు. సరిగదా ఆ దినము సమీపించనకొలది వారు ఒకరినొకరు హెచ్చరించుచుండవలెనని దీనిద్వారా మనము గమనించితిమి. సబ్బాతు చట్టము సిలువకు మేకులతో కొట్టబడి నందున (కొలస్స 2:14). ఒక క్రొత్త ఆరాధన దినమీయబడియున్నది.అది ఆదివారమే యని మనమిప్పుడు గమనించితిమి.

## ప్రభువు దినము

"ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని" అని యోహాను ప్రకటన 1:10లో వ్రాసెను. ప్రతిదినము ప్రభువు దినమే గాని యోహాను ఒక ప్రత్యే దినమును సూచించుచు దానిని ప్రభువు దినమని చెప్పుచున్నాడు. అది వారములో మొదటిదినము. 118వ దా.కీర్తన 22-24 వరకు మనము చూచిన, "ఇల్లు కట్టువారు నిషేధించిన రాయి మూలకు తలరాయి ఆయెను. అది యెహోవా వలన కలిగినది. అది మన కన్నులకు ఆశ్చర్యము. ఇది యెహోవా యేర్పాటు చేసిన దినము. దీనియందు మనము ఉత్సహించి సంతోషించెదము" అని దావీదు వ్రాసెను. అయితే యిల్లు కట్టువారైన యూదుల పెద్దలు, అధికారులు తృణీకరించిన రాయి యేసుక్రీస్తే అనియు, ఆ రాయి మూలకు తలరాయి ఆయెననియు అపొ.కా. 4:11లో పేతురు బోధించెను. తృణీకరింపబడినను యేసుక్రీస్తు మూలకు తలరాయి ఎప్పుడు అయ్యెను? ఆయన సమాధిని జయించి తిరిగి లేచినప్పుడే గదా. ఆయన సమాధి నుండి ఏ దినమున తిరిగి లేచెను ? "ఆదివారమున, తెల్లవారి నప్పుడు

యేసు లేచెనని" వాక్యము చెప్పుచున్నది (మార్కు 16:9). యేసు ఆదివారమున సమాధిని జయించి లేచెను గనుక ఆ దినమున ఆయన మూలకు తలరాయి ఆయెను. అది యెహోవా వలన కలిగినది. అది యెహోవా ఏర్పాటు చేసిన దినము అని దావీదు వ్రాసెను. యెహోవా వలన ఏర్పాటు చేయబడిన దినమే మన ప్రభువు సమాధిని జయించి లేచిన దినము. ఆ దినము ఆదివార దినము. అది ప్రభువు దినము. అందువలననే ప్రభువు దినమందు ఆత్మవశుడనై యుంటిని అని యోహాను చెప్పెను. క్రైస్తవులు దేవునిని ఆత్మతోను, సత్యముతోను ఆరాధించు దినము అది (యోహాను 4:24).

లేవీ యాజక ధర్మము చొప్పున చేయబడు పాత ఆరాధన క్రమమును తీసివేసి క్రీస్తు మనకొక క్రొత్త ఆరాధన క్రమమును, ఆరాధన దినమును ఇచ్చియున్నాడు. పాత ఆరాధన క్రొత్త ఆరాధనచే మార్చబడినది. క్రీస్తు యేసుని రక్తము ద్వారా పశు పక్ష్యాదుల రక్త బలులు అంత మొందినవి. లేవీ యాజక ధర్మము పోయి మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసుక్రీస్తు మనందరకు ప్రధాన యాజకుడయ్యెను. యాజకులు మార్చబడినందున యాజకధర్మము సహా మార్చబడెను (హెబ్రీ 7:11,12). అందువలన దేవుని నారాధించు దినము ఏడవ దినమునుండి వారములో మొదటి దినమునకు మార్చబడెను. అది అట్లు మార్చబడుటకు మనమనేక కారణములను వాక్య ప్రకారము చూడవచ్చును.

ఆదివారమున క్రీస్తు సమాధినుండి లేచెను (మత్తయి 28:1-7). ఆయన తిరిగి లేచిన తరువాత ఆదివారమున తన శిష్యులను రెండుసార్లు కలిసికొనెను (యోహాను 20:19,26).

పరిశుద్ధాత్ముడు పెంతెకోస్తు దినమున అపొస్తలులపై కుమ్మరింపబడెను. అది ఆదివారము (అపొ.కా. 2:1-4). ఏలయనగా పెంతెకోస్తు ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చెను (లేవీ 23:15-16). సువార్త మొట్టమొదటిగా వారములో మొదటి దినమున ప్రకటింపబడెను.

క్రీస్తు సంఘము ఆదివారమున స్థాపించబడెను (అపొ.కా. 2:38-47). ఆ దినమున ఇంచుమించు మూడువేలమంది సంఘముతో చేర్చబడిరి.

ఆదివారమున శిష్యులు రొట్టెవిరుచుటకు, కానుకలనీయుటకు కూడుకొనిరి. అపొ.కా. 20:7, 1కొరింథీ 16:1-2 వచనములు మనకు ఈ సంగతిని విపులముగ బోధించుచున్నవి.

ఆదివారమున క్రైస్తవులు సంఘముగా సమకూడి దేవుని నారాధించుట మానరాదు అని వాక్యము బోధించుచున్నది (హెబ్రీ 10:25). యోహాను దానిని ప్రభువు దినమని చెప్పెను. అది ఆరాధన దినము. యేసుప్రభుని వారములో వెనుక నుంచుటకంటె ముందు ఉంచు దినము అది.

మనము దేవునికి చేయు సేవ ఆయనకు ప్రీతికరముగా నుండవలెనన్న ఆయన చెప్పిన రీతిగనే మనము చేయవలెను. మానవకల్పిత సిద్ధాంతములతో మనము దేవుని నారాధించిన యెడల, " ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని మత్తయి 15:9లో యేసు చెప్పెను. నీ ఆరాధన వ్యర్థము కాకుండునట్లు ఆయన చెప్పు దినమున, ఆయన చెప్పిన రీతిగ ఆరాధించుము. నీ ఆరాధన ఆయన అంగీకరించులాగున నీవు ఆయనతోను, ఆయన సంఘముతోను చేర్చబడుము. యేసుక్రీస్తు దేవుని కుమారుడని నీ హృదయమందు విశ్వాసముంచి, నీ పాప జీవితమును పరిత్యజించి, ఆయన నామము నొప్పుకొనుచూ, నీ పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము (రోమా 10:9-10; అపొ.కా. 2:38). నీవు అట్లు చేసి ఆయన వాక్య ప్రకారము ఆయనను సేవింప మొదలిడిన యెడల నీ సేవను, నీ ఆరాధనను ఆయన తప్పక అంగీకరించును !

- జాషువా గూటం.

Edited & Published by Joshua Gootam & Printed by him at Satya Vani Publications , Kakinada - 533 004.

దేనినైనా లేక ఎవరినైనా భక్తితో గౌరవించడం ఆరాధన యని అనవచ్చును. మానవుడు దేవుని స్తుతించి ఘనపరచి. ఆరాధించడానికి సృజింపబడ్డాడు. "దైవపుత్రులారా, యెహోవాకు ఆరోపించుడి. ప్రభావ మహాత్మ్యములను యెహోవాకు ఆరోపించుడి. యెహోవా నామమునకు చెందవలసిన ప్రభావమును ఆయనకు ఆరోపించుడి" (కీర్తన 29:2) ."ఆయన మన దేవుడు మనము ఆయన పాలించు ప్రజలము ఆయన మేపు గొర్రెలము. రండి నమస్కారము చేసి సాగిల పడుదము" (కీర్తన 95:6,7).

ఆదాము హవ్వలు పాపము చేయక ముందు దైవసాన్నిధ్యమును నేరుగా పొందియుండిరి. ఆయనను ఆరాధించిరి. అయితే వారు పాపము చేయుట వలన దేవుని నుండి వారును, వారినుండి దేవుడును దూరమై పోయిరి (యెషయా 59:1,2). అయినను మానవుడు తిరిగి దేవుని యొద్దకు వచ్చుటకు ఆరాధన యొక మార్గమై యున్నది. పాత నిబంధన కాలములో ఈ ఆరాధన కుటుంబ పరముగాను, జాతీయ పరముగాను కాగా, క్రొత్త నిబంధన కాలములో యిది అంతర్జాతీయమైనది.

క్రొత్త నిబంధన ఆరాధన కొక ప్రత్యేకత యున్నది ; ఇప్పుడు మానవులు దేవుని నారాధించుటకు ఒక ప్రత్యేక పట్టణమునకు గాని, స్థలమునకు గాని వెళ్లనక్కర లేదు. ఎక్కడ ఇద్దరు ముగ్గురు ప్రభువు నామమున కూడుకొందురో అక్కడ ఆయన యుంటానని వాగ్దానము చేసారు. (మత్తయి 18:20). క్రొత్త నిబంధన ఆత్మీయ ఆరాధనయై యున్నది." దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను"(యోహాను4:24). యిందులో వస్తువులకు, వాద్యములకు అట్టివాటికి తావులేదు. సత్యవాక్యప్రకారమైన ఆరాధన ప్రతి ఆదివారమున జరుగవలసియున్నది (అపొ.కా. 20:7). అందులో పాటలు పాడుట ప్రార్థన చేయుట, వాక్యోపదేశము జరిగించుట , ప్రభురాత్రి భోజనము నాచరించుట, కానుకల నీయుట భాగమై యున్నవి. క్రొత్త నిబంధన ఆరాధన ఒక గొప్ప దీవెనయై యున్నది. ఈ యారాధనను ప్రతి క్రైస్తవుడు దేవునికి నేరుగా క్రీస్తు ద్వారా జరగించవలెను. దీనిలో మానవ మధ్యవర్తి యెవడు లేడు. ఆయన ఆజ్ఞలను గైకొనుటయే పరిశుద్ధమైన ఆరాధన యగును. అని సోదరులు హెచ్చరించిరి. స్థానిక సంఘము చక్కటి భోజన పానాదులను ఏర్పాటుచేసిరి. హాజరైన వారందిరికి నూతన ఉత్తేజము కలిగి తమ తమ గ్రామములకు తరలి వెళ్లిరి.

జూలై 19వ తేదీ ఆదివారం గొల్లవిల్లి స్థానిక సంఘ మధ్యాహ్న కాలపు ఆరాధనలో జాషువా గూటం గారు పాల్గొనిరి. గొల్లవిల్లి క్రీస్తు సంఘ కూడిక

గారు సువార్త పరిచర్య గావించుట చదువరులకు విదితమే. అదే రోజున పాల్ గూటం గారి సోదరి చింతా సువర్ణ రత్నం గారు అంబాజీ పేటలో ప్రభువునందు నిద్రించిరి. ఆమె కీ॥శే చింతా మోషే గారి సతీమణి. ఆమె విడిచి వెళ్లిన కుటుంబ సభ్యుల కొరకు ప్రార్థించుదాం.

జూలై 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గం॥లకు డెల్టా గన్నవరంలో చక్కగా నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ట చేసిరి. వాక్య పరిచర్య చేసిరి. ఆలయము, దాని పరిసర ప్రాంగణము సభ్యులతోను తదితరులతోను నిండియుండెను. సోదరులు సి.హెచ్. జాన్‌బాబు (ముంగండ) గారు అనేక వ్యయప్రయాసల కోర్చి ఈ ఆలయము ను నిర్మించిరి. జాన్‌బాబు గారు ముంగండ, గన్నవరం, నరేంద్రపురం వగయిరా గ్రామములలో సువార్త చాటుచు దేవునికి గొప్ప సేవ చేయుచున్నారు. ఈ కార్యక్రమమునకు సోదరులు పి.జె. కృపాలిని, పి.యస్.రావ్, గూటం జార్జి, వై.కొండలరావు గార్లు కూడ హాజరై వాక్య పరిచర్యలోను, యితర పనులలోను సహకరించిరి. కూటము అనంతరం ఆరుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

**Edited & Published by Joshua Gootam & Printed by him at**
**Satya Vani Publications , Kakinada - 533 004.**

**PRINTED BOOK - BOOK POST**

**From:**

**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

**To**